
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | 5



నేడు 'దగాపడ్డ దళితుడా రా కదలిరా'

నిడదవోలు, ఫిబ్రవరి 17 : దగాపడ్డ దళితుడా రా.. కదలిరా అంటూ దళితుల కోసం ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.నిడదవోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని దళిత సోదరులంతా కదలిరావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



జిల్లా ఇసుక కమిటీతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్, జేసీ

ఇసుక అక్రమాలపై టాస్క్‌ఫోర్స్

- ఐదుగురితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశాలు
- జిల్లాలో 14 ఓపెన్ రీచ్‌లకు అనుమతులు
- జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక అక్రమాలను నియంత్రించడానికి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.ఇటీవల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈబీ,మైన్స్ ఇరిగేషన్,పోలీసు, రెవెన్యూ అధికారులతో ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా గుర్తించిన 14 ఓపెన్ రీచ్‌లకు అనుమతులిస్తున్నట్టు తెలిపారు.ఐదు హెక్టార్లకు మించిన ఓపెన్ రీచ్‌లలో మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రత చర్యల్లో భాగంగా బ్యారేజీ,ఇతర వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని,హద్దులు ఏర్పాటు చేసి బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఐదు హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రీచ్‌లను గుర్తించామని, ప్రజాభిప్రాయం సేకరించి 15 రోజుల్లో కార్యాచరణ పూర్తిచేయాలన్నారు. బోట్స్‌మన్ సొసైటీలకు మార్గదర్శకాలకు లోబడి ఎన్‌వోసీలు జారీ చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఎన్. తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్,జిల్లా మైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, సెబ్ అధికారి వి.సోమ శేఖర్, గ్రౌండ్ వాటర్ అధికారివై.శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 14 ఓపెన్ ఇసుక రీచ్‌లకు అనుమతి

జిల్లాలో మరొక 14 పెద్ద ఓపెన్ ఇసుకర్యాంప్‌లకు జిల్లా ఇసుక కమిటీ అనుమతించింది.సీతానగరం మండలం సింగవరం ఇసుక ర్యాంప్‌లో 36.885 హెక్టార్లు, ముగ్గుళ్ల 30.055 హెక్టార్లు, మునికూడలిలో 33.239, కాటవరంలో 23.117 ఇసుక తవ్వకాలకు అనుమతించింది.కాతేరులో 41.51 హెక్టార్లు, కొవ్వూరు మండలం కుమారదేవం ర్యాంప్‌లో 59.07, అరికిరేవుల 59.50, చిడిపి ర్యాంప్‌లో 48.3 హెక్టార్లకు అనుమతులిచ్చింది. తాళ్లపూడి మండలం తాడిపూడి ర్యాంప్‌లో 49.40 హెక్టార్లు, పక్కిలంక ర్యాంప్‌లో 47 హెక్టార్లకు అనుమతించింది. పక్కిలంకకు చెందిన మునికూడలి ర్యాంప్ పాయింట్‌లో 37 హెక్టార్లు, నిడదవోలు మండలం పురుషోత్త పల్లి ర్యాంప్‌లో 11.50 హెక్టార్లు, జీడిగుంట ర్యాంప్‌లో 12,పెండ్యాల ర్యాంప్‌లో 44.80 హెక్టార్లకు అనుమతులు ఇచ్చింది.

నాలుగేళ్ల కిందట పట్టాలిచ్చారు..
స్థలమివ్వలేదని మహిళల ధర్నా 6

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య

23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి సూచించారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్(ఐబీ/సీబీఎస్‌సీ/ఐసీఎస్‌సీ/స్టేట్ సిలబస్) పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించాలన్నారు. చదువుపై ఆసక్తి ఉన్నా ప్రతికూల పరిస్థితుల వల్ల సాధ్యంకాని అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు http://cse.ap.gov.in వెబ్ పోర్టల్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్‌లోని డేటా ద్వారా మార్చి 22లోపుగా విద్యార్థుల అర్హతలను నిర్ధారించడం జరుగుతుందన్నారు. లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మొదటి దఫా లాటరీ ఫలితాలను ఏప్రిల్ 1న ప్రకటిస్తారని.. సీట్లు పొందిన విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీలోపుగా ఆయా పాఠశాలలకు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలన్నారు. రెండో దఫా లాటరీ ఫలితాలను ఏప్రిల్ 15న ప్రకటిస్తారని..అదే నెల 23వ తేదీలోగా సీటు నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్ / జనన ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

రాజానగరం, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిబద్ధతగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ సూచించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం జరిగిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు చేసేలా విధులను నిర్వర్తించాలన్నారు. పోటీలో నిలబడే అభ్యర్థులు చేసిన ఖర్చులు, ప్రచారం, ర్యాలీలు తదితర విభాగాల వారీగా ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రత్యేక దృష్టి సారించి వివరణ కోరాలన్నారు. ఎన్నికల నిర్బంధ నిర్వహణా వ్యవస్థ బృందాల్లో పోలీస్, ఆదాయ పన్ను, రాష్ట్ర ఎక్సైజ్, కేంద్ర, రాష్ట్ర గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ అధికారులు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్వోలు, ఈఆర్వోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

53 కేంద్రాల్లో 25న గ్రూప్-2 పరీక్షలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 53 కేంద్రాల్లో 18,501 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలకు హాజరు కానున్నారని జేసీ తేజ్ భరత్ శనివారం తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9గంటలలోగా వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదన్నారు.ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో వర్చువల్ విధానంలో జేసీ సమావేశమయ్యారు.

వలంటీర్స్!

వైసీపీకి ఓటేయించండి.. భవిష్యత్ మీదే..?



వలంటీర్‌కు సేవా అవార్డు అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

- వలంటీర్లకు వైసీపీ నాయకుల వల
- ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు
- అవార్డులంటూ నగదు బహుమతులు
- ఓట్లు దండుకునే పన్నాగానికి పదును
- పార్టీ కోసం పనిచేయాలని హుకుం
- వైసీపీకి జై కొట్టకపోతే పీకివేత
- జిల్లాలో 35 మంది తొలగింపు
- నెలకూ కేవలం రూ.5750
- ఉపాధి కూలీ కూడా రాని వైనం
- జీతం పెంపు ఊసేలేదు
- గతం వాటికే దిక్కులేదు
- ఎన్నికల ముందు మళ్లీ హామీలు

ఉపయోగించు.. వదిలెయ్.. ఇదీ జగన్ సూత్రం.. నాయకులకే కాదండోయ్.. వైసీపీ ప్రభుత్వ ఏ కార్యక్రమమైనా ముందుండి నడిపించే వలంటీర్లదీ ఇదే పరిస్థితి.. ప్రతీ ప్రభుత్వ పథకానికి.. చివరికి ప్రచారానికి వలంటీర్లను వినియోగిస్తున్నారు.. అయితే సేవకులంటూ వారికిచ్చేది మాత్రం కొంతే.. ప్రస్తుతం రూ.30 వేలు వచ్చినా బతకలేని పరిస్థితి.. అటువంటిది కేవలం రూ.5,750తో నెల మొత్తం పనిచేయిస్తున్నారు.. అంతే కాదండోయ్.. మళ్లీ వైసీపీని గెలిపించండి.. మీకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఊరిస్తున్నారు.. అధికారంలో ఉండగానే ఏం చేయలేదు.. మళ్లీ వచ్చాక చేస్తారంట అంటూ వలంటీర్లు పెదవి విరుస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'మసిపూసి మారేడుకాయ' అంటే వినడమేగానీ చూసి ఉండరు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగన్ అడుగడుగునా ఆ సామెతను నిజం చేసి చూపిస్తున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వలంటీర్ల విషయంలోనూ ముందు నుంచీ అదే జరుగుతోంది. సమాన పనికి సమాన వేతనం అనే నిబంధనను తప్పించుకోవడానికి ఆ ఉద్యోగానికి వలంటీరు అని పేరుపెట్టి కపటప్రేమ కురిపిస్తూ అడుగడుగునా వారి శ్రమను దోచుకుంటున్నారు. ఓట్ల వేటలో భాగంగా ప్రజల డేటాను దొడ్డిదారిన సేకరించడానికి వలంటీర్లను ప్రభుత్వం నియమించుకుందనేది జగనెరిగిన సత్యం. వలంటీర్లు 'వారి' సైన్యమని జగనే స్వయంగా ప్రకటిస్తున్నారు. ఏడాదికి ఓమారు వలంటీర్లపై అవార్డుల ప్రేమను ఇబ్బడిముబ్బడిగా వలకబోస్తున్నారు. అయితే వలంటీర్ల కన్నీళ్లను మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంటింటికీ తిరిగి సేవ చేస్తున్నా వచ్చే జీతం సరిపోక అప్పులపాలు అవుతున్నా.. ఆరోగ్యాలు పాడవుతున్నా ప్రభుత్వం కంటికి కనిపించడం లేదు. వలంటీర్లలో ఉన్నత విద్యను అభ్యసించిన వాళ్లు చిన్న గౌరవభృతితో నెట్టుకొస్తున్నారు. ఎన్నికల వేళ తమతో ప్రభుత్వం ఏలాగూ 'ఏకపక్షంగా' పనిచేయించుకుంటుందనీ..అప్పుడైనా తమ జీతాలు పెంచే ప్రకటన చేస్తారని పెట్టుకున్న నమ్మకం వమ్మని తేలిపోయింది. దీంతో అధికశాతం వలంటీర్లు ఆవేదనలో మునిగిపోయారు.

ప్రసన్నానికి ఎర..

ఎన్నికల వేళ వలంటీర్లను ప్రసన్నం చేసుకోడానికి వైసీపీ నేతలు ఎన్నో ఎత్తులు వేస్తున్నారు. ఎన్నికల్లో వారి సేవలను వినియోగించడానికి వీల్లేదంటూ కేంద్ర ఎన్నికల సంఘం గట్టిగా చెప్పడంతో వారి సేవలను తెరచాటున వినియోగించుకోడానికి వైసీపీ నేతలు ఉపక్రమించారు. వలంటీర్లకు సత్కారాలంటూ కొంత మొత్తం వారి చేతిలో పెట్టి వైసీపీ కోసం పనిచేయాలని హుకుం జారీ చేస్తున్నారు.సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అంటూ అవార్డులను తెరపైకి తెచ్చారు.అవి ఎందుకు ఉపకరిస్తాయో తెలియదు గానీ వైసీపీ నాయకుల బిల్డప్పులు మాత్రం వీర లెవెల్లో ఉంటున్నాయి.ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్వీయలబ్ధికి వలంటీర్లకు అవార్డుల పేరిట ఇచ్చే మొత్తాన్ని అమాంతం పెంచేసింది.అయితే ఎక్కువ మొత్తం బహుమతి ఉన్న అవార్డుల సంఖ్య తగ్గించేసి 'లెక్క' సరిపెట్టిందనే ఆరోపణలున్నాయి. విశేషంగా సేవ చేసిన వలంటీర్లకు మండల,మునిసిపల్ స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలంటూ గతంలో లేని తాయిలాన్ని ఎన్నికల సందర్భంగా ఈసారి అమల్లోకి తీసుకురావడం గమనార్హం.

ఉపాధి కూలీ నయం..

రోజుకు రూ.200 కూడా గిట్టుబాటు కాని జీతంతో జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని.. వేతనం పెంచాలని ఇన్నేళ్ల నుంచీ వలంటీర్లు పెడుతున్న గగ్గోలు చెవిటి ప్రభుత్వానికి వినిపించలేదు. వీరి జీతం ముందు ఉపాధిహామీ కూలీ రాబడి కాలరెగరేస్తోంది. వలంటీరు చేసేది ఉద్యోగం కాదని సేవంటూ వైసీపీ ప్రభుత్వం తీపి కబుర్లు చెబుతూ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటోంది. వారి ఆవేదనను వినిపించడానికి సమ్మె చేద్దామని అనుకున్నా బెదిరింపులతో నోళ్లు నొక్కేసింది. తమకు నెలకు ఇచ్చే రూ.5,750 జీతం ఎలా సరిపోతుందని, పెట్రోలు ఖర్చులకు రావడం లేదని వలంటీర్లు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్ పాడైతే ఆ జీతంలోనే మరమ్మతు చేయించుకోవాలి. ఇతర ఎలవెన్సులేమీ ఉండవు. కానీ, జీతం పెంపుపై ప్రభుత్వం ఎప్పుడూ దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఎన్నికల వేళ కొంత డబ్బు ఆశజూపి 'ఓట్లు' వేయించుకొనే పన్నాగానికి పదును పెట్టింది.

మా బొమ్మే ఉండాలి..

వలంటీర్లను ప్రభుత్వం ఎంత వేదనకు గురిచేస్తుందో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. నెలకు లక్షల రూపాయలు జీతం అందుకునే కొలువులో ఉన్నా ఆ ఉద్యోగికి సొంతంగా కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. దానిని ప్రశ్నించే అధికారం ప్రజాస్వామ్యంలో ఎవరికీ లేదు. కానీ, రోజు కూలీ కూడా గిట్టుబాటు కాని వలంటీర్లపై వైసీపీ పెద్దలు గెద్దల్లా మారి మౌఖిక ఆదేశాలిచ్చేస్తున్నారు. వైసీపీ గెలుపునకు అహర్నిశం పనిచేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వైసీపీ మినహా ఇతర పార్టీ వాళ్లతో కనబడినా చాలు ఉద్యోగం పీకేస్తున్నారు. ధవళేశ్వరం, రాజమహేంద్రవరం రూరల్‌లో 35 మంది వలంటీర్లను ఇటీవల తొలగించారు.వాళ్లు చేసిన తప్పు ఏమిటంటే జనసేన నాయకుల ఫొటోలను పెట్టుకోవడమేనట. ఇలా బొమ్మా మాదే.. బొరుసూ మాదే ఉండాలి. లేదంటే పీకేస్తామంటూ వైసీపీ నాయకులు బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారిపోయింది. వైసీపీకి ఎన్ని ఓట్లు వేయిస్తే అన్ని తాయిలాలంటూ మభ్యపెడుతున్నారు. వలంటీర్లు తమ ఓటును కూడా ఇష్టపూర్వకంగా వేసుకోడానికి వీల్లేని పరిస్థితిని సృష్టిస్తున్నారు.

ఉద్యోగం ఉంటుందా!?

వలంటీర్ల చేతిలోని ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లో ప్రజల సమాచారం నిక్షిప్తమై ఉంది. ఆ సమాచారాన్ని ఎన్నికల వేళ వాడుకునేందుకు ఫోన్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని సమాచారం.ఈ విషయంపై ఇప్పటికే కొందరు వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వచ్చే నెల నుంచి ఉద్యోగం ఉంటుందో లేదోననే సందిగ్ధం నడుస్తోంది. ఫోన్లు వెనక్కు తీసుకొని అవార్డుల పేరుతో కొంతమొత్తం చేతిలో పెట్టి సరిపెట్టుకోమనే ఉద్దేశంలో వైసీపీ ప్రభుత్వం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 9,034 మంది వలంటీర్లు ఉండగా.. సుమారుగా అందరికీ అవార్డులను ప్రకటించేశారు. మూడు కేటగిరీల్లోనూ బహుమతి మొత్తం ఎక్కువగా ఉన్న సేవావజ్ర విభాగంలో కేవలం 37 మందిని మాత్రమే ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం సేవలందిస్తున్న వలంటీర్లలో సేవావజ్రాలు 5 శాతం లేకపోవడం గమనార్హం. సేవారత్నల కేటగిరీలో 118 మందికి మాత్రమే అవకాశం దక్కింది. మిగతా వారందరికీ సేవామిత్ర పేరుతో స్వల్ప మొత్తం ముట్టజెప్పనున్నారు. జాబితా ప్రకారం కొవ్వూరు అర్బన్, పెరవలి మండలాల్లో సేవా వజ్రాలు లేనేలేరు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఆరుగురు ఉండగా.. మిగతా మండలాల్లో మండలానికి ఒకరిద్దరిని ఎంపిక చేశారు. ఇప్పటికే జగన్ ఈ 'పథకాన్ని' ప్రారంభించగా.. జిల్లాలకు ఇంకా నిధులు రాలేదు. అందాక శాలువాలు, పతకాలు మాత్రం వచ్చాయి. వలంటీర్ల పేర్లతో కూడిన జాబితా కూడా రావాల్సి ఉంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాదే : దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 :రాజమహేంద్రవరం రూరల్ సీటు తనదేనని, ఈ మేరకు పవన్ కల్యాణ్ స్పష్టమైన హామీ ఇచ్చారని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను అసత్యాలు చెప్పడంలేదని, నాలుగురోజుల కిందట మంగళగిరి వెళ్లినప్పుడు పవన్ కల్యాణ్ తనతో చెప్పడం జరిగిందన్నారు. దీనిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా అధికారిక ప్రకటన చేయాల్సి ఉందన్నారు. రెండేళ్ల క్రితం టీడీపీతో మాకు పొత్తులేదు.. అప్పుడు చంద్రబాబు తన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇస్తామని చెప్పి ఉండొచ్చు అన్నారు. కానీ ఇప్పుడు జనసేనతో పొత్తు ఉంది. పొత్తు ధర్మం పాటించాల్సిందే అన్నారు. పవన్ కల్యాణ్ పర్యటనలకు అడ్డంకులు సృష్టిస్తున్న అధికారులు ఎన్నికల తర్వాత ఇబ్బంది పడాల్సి ఉంటుందని, ఎవరు వ్యతిరేకంగా పనిచేస్తున్నారో గుర్తు పెట్టుకుంటామన్నారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగించాలని వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి కోరడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో నగర ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

మహిళల రక్షణకు చట్టాలు : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలతో గౌరవంగా ప్రవర్తించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధచట్టం-2013పై జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్షకు, వేధింపులకు గురవుతుండడం దురదృష్టకరమన్నారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి కార్యాలయంలో ఉండే అంతర్గత ఫిర్యాదుల కమిటీకి బాధితుల తరపున ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ స్పష్టం చేశారు. వేధింపుల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అవసరమైతే బాధించినవారిని విధుల్లోంచి తొలగించడానికి అవకాశం ఉందన్నారు.మహిళలకు చట్టం అండగా ఉంటుందన్నారు. సమస్యలను ధైర్యంగా చట్టం ముందుకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం కోర్టుల్లో పనిచేస్తున్న 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని..

భర్త ఆత్మహత్య

రాజానగరం,ఫిబ్రవరి 17 : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్(36) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తడంతో ఏడాది కిందట భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల భార్య వద్దకు వెళ్లి కాపురానికి రావాలని కోరాడు. అయితే భార్య నిరాకరించడంతో 15వ తేదీన ఇంటికి వచ్చి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఉపక్రమించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ శనివారం కేసు నమోదు చేసినట్టు సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

15న ఇంటి నుంచి వెళ్లి..

17న క్వారీ గోతుల్లో శవమై..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు ఓ రోజులో నిర్జీవంగా ఇంటికి చేరడంపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. సుబ్బారావునగర్‌కి చెందిన తుమ్మల లోవరాజు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో 16న త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. క్వారీ మార్కెట్ సమీపంలోని క్వారీ గోతుల్లో ఓ శవం తేలుతోందని పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి ఆ మృతదేహాన్ని బయటకు తీశారు. అంతకుముందు వచ్చిన ఫిర్యాదుతో సరిపోల్చి విచారించగా లోవరాజు(26) అని బంధువులు గుర్తుపట్టారు.కేసు తదుపరి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ పేర్కొన్నారు. క్వారీ గోతుల్లో జనం పడి చనిపోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సర్కారు తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఏపీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు శనివారం ధర్నా చేశారు. నగరంలో ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నగర జేఏసీ అధ్యక్షులు సుబ్బారావు నాయుడు, కన్వీనర్ సేవా ప్రవీణ్‌కుమార్, ఏపీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనుదారులను తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేస్తున్నదని విమర్శించారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలకు, పెన్షన్‌కు ఎదురు చూడాల్సిన దుర్భర పరిస్థితి ఉందన్నారు. అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్మోహనరెడ్డి చేతులెత్తేశారని, 180 నెలలకు పైగా డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.షరీఫ్, రమేష్, పింఛనుదారుల సంఘం నాయకులు కేజీకే మూర్తి, కేకే సంజీవరావు, పార్వతి, ఎన్జీవో నాయకులు అనిల్‌కుమార్, మీసాల మాధవరావు, రాజశేఖర్, ఆనంద్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, గెజిటెడ్ అధికారుల సంఘం తరపున వ్యవసాయ అధికారులు శాంతా ఆలివ్ ఇతర అధికారులు పాల్గొని మద్దతు తెలిపారు.





రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, పింఛనుదారుల ఆందోళన

ఉద్యోగులకు నోటీసులు..

రాజమహేంద్రవరం అర్బన్/తాళ్లపూడి, ఫిబ్రవరి 17 : పాత పింఛను సాధన కోసం సీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన చలో విజయవాడకు వెళ్లవద్దని పోలీసులు అడ్డుకున్నారు. విజయవాడలో జరిగే ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు నోటీసులు జారీ చేశారు.రాజమహేంద్రవరంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు,ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గా రావు, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావులకు శనివారం నోటీసులు అందజేశారు. దీనిపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేమంతా ఉద్యోగులమే కాని దొంగలం కాదని తమ న్యాయమైన కోర్కెల సాధనకై చేపట్టే కార్యక్రమాలను నిలువరించడానికి ఉద్యోగులను ఇలా హింస పెట్టడం దుర్మార్గ చర్య అన్నారు. ప్రభుత్వం చర్యలను ఖండిస్తూ దర్నాకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వందల మందిపై కేసులు పెడుతున్నందున చలో విజయవాడ వాయిదా వేసుకోవాలంటూ రాష్ట్ర నాయకత్వం తెలిపినప్పటికీ ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ నిరసనలు తెలియజేయనున్నారు.





తాళ్లపూడిలో ఏపీటీఎఫ్, సీపీఎస్ సంఘాల నాయకులకు నోటీసులు

పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



గరుడ పుష్పక వాహనంపై
ఊరేగిన స్వామివారు
బ్రహ్మరథం పట్టిన భక్తులు
అలరించిన సాంస్కృతిక
కార్యక్రమాలు





అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మించిన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్‌ఐ ఎస్.రాము, అర్చకులు, వాహనకారులు పాల్గొన్నారు.



హైకోర్టు జస్టిస్ పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీ హైకోర్టు జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఏసీ సత్యనారాయణ వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.రాము, తహసీల్దార్ పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌వే రూట్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వామివారి కల్యాణం, రథోత్సవాల రోజుల్లో వన్‌వే రూటు తప్పనిసరిగా కొనసాగించాలని సీఐ గోవిందరాజు అన్నారు. 19, 20 తేదీల్లో స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులందరూ అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేది మీదుగా దేవస్థానం గుడికి చేరుకోవాలని, స్వామి కల్యాణం తిలకించి దర్శనం చేసుకున్న భక్తులు ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తూ అంతర్వేది ఏటిగట్టు నుంచి గొంది, గుడిమూల మీదుగా సఖినేటిపల్లి నుంచి సురక్షితంగా వెళ్లాలన్నారు. సఖినేటిపల్లి మండలంలో ఉన్న ప్రజలంతా వన్‌వే రూటుకు ఎదురు వెళ్లరాదని, పది రోజుల ఉత్సవాల్లో వన్‌వే రూటు పాటిస్తూ 19, 20 తేదీల్లో మాత్రం స్థానిక ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 7 గంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు హంస వాహనం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహరణ, రాత్రి 7 గంటలకు శేషవాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో తరించాలని కోరారు.

బంధాల విలువలు తెలిసేలా..

ఆకట్టుకున్న నాటికలు



అమృతహస్తం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 17: కుటుంబ సంబంధ బాంధవ్యాలు, భార్యాభర్తలు, అన్నాచెల్లెల అనుబంధం విశిష్టతను చాటిచెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై తొలిరోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. ఆధునిక సమాజం సంబంధ బాంధవ్యాలు దూరమవుతున్న తరుణంలో అన్నాచెల్లెల అనుబంధం గొప్పతనాన్ని చాటుతూ అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. అన్నాచెల్లెల మధ్య అప్యాయత, అనురాగాలను చక్కగా వివరించారు. చెల్లెలి వివాహ జీవితం ఇబ్బందుల్లో పడి ఆమె భర్త వేధిస్తుంటే తన ఇంటికి తీసుకువచ్చి చూసుకోవడం, అన్న, చెల్లెలు కలిసి బావకు బుద్ధిచెప్పడం ఇతివృత్తంగా నాటిక సాగింది. గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుందంటూ అందులోని గొప్పతనాన్ని చాటిచెబుతూ ప్రదర్శించిన బంధం నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు, తోడబుట్టిన వాళ్లు, మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు, పెళ్లి తర్వాత భార్యాభర్తలు, బిడ్డలు ఇలా ఎన్నో బంధాలు జీవిత చరమాంకం వరకూ ఉంటాయి. ఇందులో భార్యా భర్తల బంధం విశిష్టమయినది. ఎన్ని అవాంతరాలు ఎదురయినా పటిష్టంగా ఉండాలి తప్ప దారి తప్పిన ఆలోచనలతో దానిని విచ్ఛిన్నం చేసుకుంటే వచ్చే ఇబ్బందులను ఈ నాటిక ద్వారా తెలియజెప్పారు. విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను మాడుగుల రామకృష్ణ రచించగా, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 17: కోనసీమ తిరుమల వాడపల్లి గోవిందనామస్మరణతో మార్మోగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగంను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.44.90 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనర్, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు



పిఠాపురం, ఫిబ్రవరి 17: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒక్కటైన కాకినాడ జిల్లా పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. ఇంద్రుడు దేశంలో అయిదు ప్రాంతాల్లో మాధవ క్షేత్రాలను ప్రతిష్ఠించగా అందులో పిఠాపురం ఒక్కటని, పాండవుల తల్లి కుంతీదేవితో పూజలు అందుకుని కుంతీమాధవుడిగా విరాజిల్లుతున్నట్లు పండితులు చెబుతారు. కుంతీమాధవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు 25వ తేదీ వరకూ జరగనున్నాయి. 18న ఉదయం పంచామృతాభిషేకం, రాత్రి ధ్వజారోహణం, విష్వక్సేనుల వారి గ్రామోత్సవం, 19న చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి ఉత్సవులకు అలంకార తిరుమంజనం, కల్యాణాలంకారం, 20న పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి స్వామి కల్యాణం, 21న ఉదయం, సాయంత్రం శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవం, 22న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 23వ తేదీ రాత్రి రథోత్సవం, 24న ఉప్పాడ సముద్రం వద్ద స్వామికి చక్రస్నానం, అన్నసమారాధన, రాత్రి ఆలయంలో చోర సంవాదం, 25వ తేదీన పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయి. ప్రతిరోజూ వేద పారాయణం జరుగుతుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, కుంతీ మాధవ భక్తబృందం సభ్యులు తెలిపారు.

22న రత్నగిరిపై సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 17: ఇంటర్, పదో తరగతి, ఇతర ముఖ్యమైన పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఈనెల 22న సరస్వతి పూజను నిర్వహించనున్నట్లు రత్నగిరి ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. విద్యార్థులచే సరస్వతి పూజను చేయించి కలములు, కంకణాలను అందించనున్నామన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

స్థలాలు లేని పట్టాలెందుకు?

- తక్షణమే స్థలాలు చూపాలని మహిళల ధర్నా
- కడియం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- రెండు గంటల పాటు ఆందోళన
- రోడ్డుపై భారీగా నిలిచిన ట్రాఫిక్
- సమస్య పరిష్కరిస్తామని జేసీ తేజ్‌భరత్ హామీ



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కడియం, ఫిబ్రవరి 17: 'వైసీపీ ప్రభుత్వం జగనన్న పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు దాటింది.. పట్టాలిచ్చారు కానీ నేటికీ స్థలాలు చూపలేదు. అద్దె ఇళ్లలో ఉంటున్నాం.. అదిగో స్థలం.. ఇదిగో పట్టా అంటూ మోసగిస్తున్నారు కానీ ఇళ్ల స్థలాలు చూపలేదు' అని కడియం మండలం వేమగిరి తోట, గట్టు, వేమగిరి గ్రామాలకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండు గంటల పాటు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిత్యం రద్దీగా ఉండే వేమగిరి-కాకినాడ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమస్య పరిష్కరిస్తేనే కానీ కదిలేది లేదని స్పష్టం చేశారు. మండలంలో వేరే వేరే ఊర్లు వారికి స్థలాలు ఇచ్చారు. ఊరిలో ఉండే తమకు ఇవ్వలేదని వాపోయారు. శనివారం ఉదయం స్థలాలు ఇస్తున్నామంటూ పిలిచి రాళ్ల వద్ద ఉండమని పట్టాపై నెంబర్ ఇచ్చారని దాని కోసం రూ. 150 చొప్పున తీసుకున్నారని చెప్పారు. అలానే రాళ్లకు రూ. 400 చొప్పున తీసుకున్నారన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తారేమో అని గత కొద్దిరోజులుగా ప్రతి రోజు పనులు మాని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఏమి ప్రయోజనం లేదన్నారు. సుమారు 800 కుటుంబాలను పట్టాలు ఆశ చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. జగనన్న లేఅవుట్‌లో సుమారు 20 ఎకరాల జడ్పీ భూమిని లేఅవుట్‌గా కేటాయించి నాలుగేళ్ల కిందట సుమారు 800 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చారన్నారు. సాంకేతిక కారణాలు చూపి పట్టాలున్న వారికి స్థలాలు ఇవ్వకుండా జాప్యం జరుగుతుందన్నారు. ఆందోళన ఉధృతంగా మారుతుందనే సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ బి.రమాదేవి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు తమకు న్యాయం చేయాలని లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో తహశీల్దార్ రమాదేవి కొంతమంది ప్రతినిధులను కార్యాలయంలోకి రమ్మని వారితో మాట్లాడారు. అనంతరం ఐదుగురు తహశీల్దార్‌తో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లగా అక్కడ జేసీ తేజ్‌భరత్ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపి న్యాయం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఆందోళన కార్యక్రమంలో నల్లా వరలక్ష్మి, డి.సాయిలక్ష్మి, ఎస్.పద్మావతి, స్వర్ణలత, జోగి మల్లేశ్వరి, భోగిరెడ్డి జ్యోతి, ఇసుకపూడి వెంకటలక్ష్మి, ఇసుకపూడి సత్యవతి, నాగదేవి, ఈడేపల్లి దివ్య, పడాల శ్రీదేవి, పితాని సూర్యకుమారి, ఆకుల సత్యవేణి, ఈత మంగాదేవి, పార్వతి, నూకల లక్ష్మి, కోనే పద్మావతి, అల్లం వెంకటేశ్వరావు, షేక్ రెహమాన్, జ్యోతి, నాగిరెడ్డి, దేవి, జి.దివ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రమాదేవితో చర్చలు

రత్నగిరిపై పెళ్లిసందడి

అన్నవరం, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం పెళ్లి బాజాలతో హోరెత్తింది. మాఘమాసంలో శనివారం బలమైన ముహూర్తాలు రాత్రి 11.30, వేకువజామున 3.30 నిమిషాలు కావడంతో స్వామివారి సాక్షిగా వివిధ ప్రాంతాలలో జరిగిన వివాహాలతో సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. సత్రం గదులు సరిపడకపోవడంతో పెండ్లిబృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివాహ బృందాల కోసం ఉచిత కల్యాణ మండపాలు, విష్ణుసదన్ హాల్స్, సీతారామ సత్రం, పాత, కొత్తసెంటినరీ కాటేజీలు, ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేయించే పురోహితులు, భాజాభజంత్రీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆలయ ప్రాంగణమంతా వివాహ బృందాలతో రద్దీగా మారింది. ఆదివారం ఉదయం స్వామివారి సన్నిధికి విశేషంగా భక్తులు, నవదంపతులు విచ్చేయనుండడంతో అధికారులు వారికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

అద్దెకు ఉంటూ దొంగతనాలు

కడియం, ఫిబ్రవరి 17: అద్దెకు ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కడియం పోలీసులు పట్టుకున్నారు. సీఐ బి.తులసీధర్ వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం నల్లమందు సందులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. అతడిని విచారించగా పెరవలి మండలం ఖండవిల్లికి చెందిన పల్లెపు విజయకుమార్‌గా గుర్తించామన్నారు. అతడు 2, 3 నెలల కొకసారి ఊర్లు మారుతూ ఇంటి ఓనర్లతో, చుట్టుపక్కల వారితో స్నేహం చేసి వారిని మభ్యపెట్టి వారింట్లో దొంగతనాలకు పాల్పడుతుంటాడన్నారు. అలాగే వేమగిరిలో దొడ్డా ఉమాపార్వతి బంధువుల ఇంటికి 3నెలల క్రితం అద్దెకు వచ్చి వారింట్లో సుమారు రూ.2 లక్షల బంగారం దొంగిలించుకుపోయాడన్నారు. అతనిపై తెనాలి, విశాఖపట్నంలో కూడా కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచినట్టు చెప్పారు.

కోట సత్తెమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా హరి

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం(శివ)ను సామర్లకోటలోని కుమార భీమేశ్వరస్వామి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేశారు. కోట సత్తెమ్మ ఆలయాన్ని అసిస్టెంట్ పరిధిలోకి తీసుకురావడంతో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హరి సూర్యప్రకాష్‌ను కోట సత్తెమ్మ ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో బాధ్యతలు స్వీక రించనున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.58 లక్షలు

మామిడికుదురు, ఫిబ్రవరి 17: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని వారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,58,509 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. స్వామివారిని 2,863మంది దర్శించుకుని 2,095మంది అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి వెదురుపాకకు చెందిన వాకపల్లి సూర్యనారాయణమూర్తి, వాన వెంకటసూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

బావిలో మహిళ మృతదేహం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17: ఈనెల14న అదృశ్యమైన ద్రాక్షారామ బియ్యంపేటకు చెందిన వివాహిత మృతిచెందింది. ఆమె మృతదేహం శనివారం ఓ బావిలో కనిపించింది. బియ్యంపేటకు చెందిన దొంగల వరలక్ష్మి (30) ఈనెల 14 తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదు. భర్త నరసింహమూర్తి, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం రాత్రి వరలక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం బెస్తపేట సమీపంలో బావిలో వరలక్ష్మి మృతదేహం కనిపించింది. ఎస్‌ఐ సురేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌ఐ సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

రామచంద్రపురం, ఫిబ్రవరి 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నకిలీ నోట్ల ముఠాను శనివారం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. చెడు వ్యసనాలకు, ఈజీ మనీకి అలవాటు పడ్డ మాగంటి గోపి, బోయ గోవిందరావు, వాసంశెట్టి వీరభద్ర రఘురాం, బడుగంటి వీరవెంకటరమణలు ముఠాగా ఏర్పడ్డారు. వారికి విజయనగరం జిల్లా గూడుపువలసకు చెందిన చల్లా నూకరెడ్డి, విజయనగరం జిల్లా శాంతినగర్‌కు చెందిన మీసాల అప్పలరాజులు నకిలీ నోట్ల తయారీకి కావలసిన సామగ్రిని అందిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన బోయి గోవిందరావు ఈ సామగ్రిని రామచంద్రపురానికి చేరవేస్తున్నాడు. రామచంద్రపురం పట్టణం రత్నంపేటకు చెందిన మాగంటి గోపి, రామచంద్రపురం మండలం నరసాపురపుపేటకు చెందిన బడుగంటి వీరవెంకటరమణ, రాయవరం మండలం వెంటూరుకు చెందిన వాసంశెట్టి వీరభద్రరఘురామ్‌లు రామచంద్రపురంలో రత్నంపేటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ నోట్లు ముద్రిస్తున్నారు. రద్దీగా ఉండే రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో నకిలీ నోట్లు చలామణి చేస్తున్నారు. ఏడాది కాలంగా నకిలీ నోట్లు ముద్రణ, చలామణి చేస్తున్నారు. నకిలీ ముద్రణలో బోయి గోవిందరావు కూడా సహకరిస్తున్నాడు. పోలీసులకు అందిన సమాచారంతో శనివారం ఎస్పీ శ్రీధర్‌బాబు ఆదేశాలతో డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి నకిలీ నోట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మాగంటి గోపి, బడుగంటి వీరవెంకటరమణ, వాసంశెట్టి వీరభద్రరఘురామ్, బోయి గోవిందరావులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.75,000 నకిలీ నోట్లు, రెండు ప్రింటర్లు, నకిలీ నోట్ల ముద్రణకు వాడే ఎ4 కాగితాల కట్ట, వాటర్‌మార్కు, దారం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. విజయనగరం జిల్లాకు చెందిన చల్లా నూకరెడ్డి, మీసాల అప్పలరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్‌ఐ సురేష్‌బాబుని, పోలీసు సిబ్బందిని ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ స్థాయికి ఎంపికైన తొండవరం విద్యార్థుల ప్రాజెక్టు



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు ఇదే..

అంబాజీపేట, ఫిబ్రవరి 17: జైపూర్‌లో మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెర్స సంస్థ నిర్వహించిన ఎస్ఐసీ ఇన్నోవేషన్ కాంటెస్టులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయికి ఏపీ తరుపున ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఒకే ఒక ప్రాజెక్టు ఎంపికైందని పాఠశాల హెచ్ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కొబ్బరి పీచుతో తయారు చేసిన కోకోనట్ క్వాయర్ కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టును పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గణేష్ నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఎన్.శ్రీరామ్, ఎం.నమిత, ఎం.పార్వతి రూపొందించి శనివారం ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులు 24 ఎంపిక చేయగా వాటిలో తొండవరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తుతెలియని బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

రాయవరం, ఫిబ్రవరి 17: సోమేశ్వరం-కుతుకులూరు రోడ్డులో ఇటుక బట్టీ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పులగం ధర్మారెడ్డి(70) కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వృద్ధుడిని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న దంపతులు ఢీకొట్టడంతో అతడు మృతిచెందాడని, రోడ్డు పక్కనే వృద్ధుడిని పడుకోబెట్టి దంపతులు వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఇటుక బట్టీ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. రాయవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏజెన్సీ సమాచారం

ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

కార్యకర్తల సమావేశంలో వంతల రాజేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న వంతల రాజేశ్వరి

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 17: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రం వీఆర్ పురంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ సాధికారత కమిటీ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, ఓటరు పరిశీలన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సీఎం జగన్ సిద్ధం అంటున్నారని... లక్షా పదిహేను వేలు తీసుకున్న నిర్వాసితులకు అధికారంలోకి రాగానే రూ. ఐదు లక్షలు ఇస్తానని మాట తప్పినందుకా సిద్ధం.., ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పది లక్షలు ఇస్తానని మాట తప్పి నందుకా సిద్ధమా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి, మండల కార్యదర్శి బురక కన్నారావు, సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, ఐటీడీపీ కన్వీనర్ ముత్యాల సిద్దు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బీరక సూర్యప్రకాష్‌రావు, మండల ట్రెజరర్ పెందుర్తి సుదర్శన్, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శులు బురక సారయ్య, కారం శిరమయ్య, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, ఎటపాక మండల అధ్యక్షుడు పుట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

అడ్డతీగల, ఫిబ్రవరి 17: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శనివారం స్థానిక ఉపాధ్యాయులు తాలూకా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టి తదుపరి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు బకాయిలు ఉన్న డీఏలు చెల్లించి, ఒకటో తేదీన విధిగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని 12వ పీఆర్‌సీ విధి విధానాలను వెంటనే ప్రకటించాలన్నారు. పీఆర్సీ ఇచ్చే వరకు ఐఆర్ ఇవ్వాలన్నారు. డీఎస్సీలో పొందుపరిచిన అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి తేజారావు, జిల్లా ఆడిట్ మెంబర్ మంగరాజు, జిల్లా కౌన్సిలర్ నాగప్రసాద్, సంఘ అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి కేవీ రాఘవ, రమణమ్మ, కమలరత్నం, దొరబాబు, సీపీఐ నాయకులు ఐ.రమణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మోతుగూడెం,ఫిబ్రవరి17:చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న ఫోర్ బై గ్రామంలో శనివారం చింతూరు తహసీల్దార్ ఎండీ నజీమ్‌ముల్లాషా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికలు రాబోతున్నందున పై అధికారుల ఆదేశాల మేరకు ఈ పోలింగ్ బూత్‌లను పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ బి.దేవయ్య, మండల సర్వేయర్ ఎస్.గోవింద్‌రాజు, వీఆర్వో కె. వెంకటేశ్వర్లు ఉన్నారు.

వరద నీటిలోనే అమ్మవారి ఆలయం

దేవీపట్నం,ఫిబ్రవరి17: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం గత తొమ్మిది నెలల నుంచి వరద నీటిలోనే ఉండిపోయింది. గతేడాది ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి వరద పెరగడంతో ఆలయం వరదనీటిలో మునిగింది. పోలవరం ప్రాజెక్టు కాఫర్ డ్యాం వద్ద నీటిని నిల్వ చేయడంతో అప్పటి నుంచి అమ్మవారి దర్శనాన్ని అధికారులు నిలిపివేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

దేవిపట్నం,ఫిబ్రవరి17: మండలంలో ఇందుకూరు గ్రామ సమీపంలో తమ్మిశెట్టివారి చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు.

జీవం పోసుకుంది..!



వై.రామవరం,ఫిబ్రవరి17: గాలి వానలకు పడిపోయిన పనస చెట్టు మోడుగా మారింది. అయితే ఆ మోడుపైనే కొత్త ఆకులు చిగురించిన చెట్టు ఇప్పుడు పండ్లను కూడా ఇస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం నెల్లికోట సమీప అటవీ ప్రాంతంలో ఈ దృశ్యం కనిపించింది.



నేడు నిడదవోలులో

'దగాపడ్డ దళిత వీరా రా కదలిరా'

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలులోని బీఆర్ అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు దగా పడ్డ దళిత వీరా రా కదలి రా కార్యక్రమం నిర్వహిస్తున్నామని మహాసేన ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా మహాసేన రాజేష్ హాజరవుతారని, జిల్లాలోని దళితులందరూ కదలి రావాలని కోరారు.

అధికారులు మారినా.. బోర్డులో పేర్లు మారలే!

▸ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో 4 నెలలుగా విచిత్ర పరిస్థితి



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సిటీ ప్లానర్ పేరు మార్చకుండా వదిలేసిన బోర్డు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పని చేసిన కొంత మంది అధికారులు బదిలీ అయి నాలుగు నెలలు గడచినా ఆ అధికారుల పేర్లు మార్చలేదు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి సూరజ్ కుమార్‌ను నాలుగు నెలల కిందట బదిలీ చేశారు. అటుపై అసిస్టెంట్ సిటీప్లానర్‌గా వచ్చిన సుభాష్ చంద్ర బోస్‌కు ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన కొంత కాలం పనిచేశారు. అటుపై సిటీ ప్లానర్‌గా పూర్తి బాధ్యతలను జీవీఎస్ఎన్ మూర్తికి అప్పగిస్తూ నియమించగా ఆయన వచ్చి బాధ్యతలు స్వీకరించారు. సుమారు రెండు నెలలు గడిచినా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇంకా సిటీ ప్లానర్‌గా గతంలో పనిచేసిన సూరజ్ కుమార్‌నే చూపిస్తూ నేమ్ బోర్డులో ఉంచేశారు. కొత్తవారు ఎవరైనా కార్యాలయానికి వస్తే సిటీప్లానర్‌గా సూరజ్ కుమార్ తిరిగి రాజమహేంద్రవరం వచ్చేశారా అనుకుని అయోమయానికి గురవుతున్నారు. దీంతో విచిత్ర పరిస్థితి నెలకొంటుంది.

అనపర్తిలో ఉచిత వైద్య శిబిరం

అనపర్తి, ఫిబ్రవరి 17: అనపర్తిలోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెన్షనర్ల కుటుంబాలకు కాకినాడ మెడికోవర్ ఆసుపత్రి వైద్యుడు కొడాలి అరుణ్‌కుమార్, ఆర్థో పెటిక్ సర్జన్ పాణింగపల్లి భోగేంద్రసాయి తదితరులు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా వైద్యులను పెన్షనర్స్ అసోసియేషన్ సత్కరించింది. కార్యక్రమంలో వీవీఎస్ సూర్యనారాయణ, గొలుగూరి రామారెడ్డి, ఎంవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే.. అసత్య ఆరోపణలు మానుకోవాలి

▸ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



రంగంపేట: రామేశంపేటలో భవిష్యత్‌కు గ్యారెంటీలో మహాలక్ష్మి

అనపర్తి, ఫిబ్రవరి 17: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తనపై అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు అసత్య ఆరోపణలు చేస్తూనే ఉన్నారని సొసైటీ నిధులు తాను కైంకర్యం చేసినట్టు నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన రామవరంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీల్లో హమాలీ చార్జీలను తాను తీసుకున్నట్టు ఆరోపణలు చేశారని దీనిపై వేసిన విజిలెన్స్ నివేదికలు, 51 ఎంక్వయిరీలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. నిజాలు బయటకు వస్తే అధికారులు ఇబ్బంది పడతారని మాట్లాడటం చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. తన బావ మృతి కేసులో సుప్రీంకోర్టు నిబంధనలు ఉల్లంఘించి తనపై కేసులు పెట్టించిన సమయంలో పోలీసు అధికారులు ఇబ్బందులు పడతారని గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా చౌకబాబు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

విజిలెన్స్ రిపోర్ట్ ఎందుకు బయట పెట్టలేదు?

రంగంపేట, ఫిబ్రవరి, 17: మండలంలో ఈలకొలను, జి.దొంతమూరు, దొడ్డిగుంట గ్రామాల్లో చెరువులలో మట్టి తవ్వించానని దానిపై విజిలెన్స్ ఎంక్వరీ వేయించి మూడున్నరేళ్లయ్యిందని, ఆ రిపోర్టును ఇంతవరకు ఎందుకు బయట పెట్టలేదో సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. శనివారం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు విజిలెన్స్ ఎంక్వరీ వేసి ఇంతవరకు తనను అరెస్ట్ చేయలేదంటే తప్పు చేయలేదనే అర్థమన్నారు. రిపోర్టు బయటపెట్టి తాను తప్పు చేశానని నిరూపిస్తే జైలుకి వెళ్ళడానికి ఇప్పటికీ సిద్ధంగా ఉన్నానన్నారు. ఇదిలా ఉంటే జలకళ పేరు చెప్పి నియోజకవర్గంలో రూ.7 కోట్లు చేతులు మారాయని, ఇప్పుడు చెరువుల గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు.

రామేశంపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ..

రంగంపేట, ఫిబ్రవరి 17: రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి కోరారు. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కోటపాడు శివారు రామేశంపేట, రామకృష్ణాపురంలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని మహాశక్తి పథకాలు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, నీలపాల త్రిమూర్తులు, వెలుగుబంటి సత్తిబాబు, ఆచంట వెంకటేశులు, అడబాల వెంకటరావు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్'తో వైసీపీలో వణుకు : బీవీఆర్ చౌదరి

కోరుకొండ, ఫిబ్రవరి 17: రాజానగరంలో రాజధాని ఫైల్స్ సినిమాను వైసీపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేయడం, సినిమా బృందం ఈ విషయంపై కోర్టుకు వెళ్ళడం, హైకోర్టు సినిమా ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జగన్‌కు చెప్పపెట్టు అని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి శనివారం ఓ ప్రకటనలో అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం 33వేల ఎకరాల భూమిని 28వేల మంది రైతులు స్వచ్ఛందంగా ఇవ్వడం చరిత్రలోనే అపూర్వమన్నారు. అటువంటి రైతులపై వైసీపీ ప్రభుత్వం పైశాచికత్వం ప్రదర్శించడం, రాజధాని విధ్వంసం చేయడం అమానుషమన్నారు. ఈ సంఘటనల ఆధారంగా చిత్రీకరించిన రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శనను వివిధ మార్గాల్లో అడ్డుకోవాలని వైసీపీ ప్రభుత్వం భావించడం శోచనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో దిక్కుతోచని స్థితిలో సీఎం జగన్ ఇలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక సినిమా చూసి ముఖ్యమంత్రి భయపడడం ఇదే తొలిసారి అన్నారు.

రేపటి నుంచి సీపీఎం ప్రజానిధి సేకరణ



సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17: కార్పొరేట్ కంపెనీల నుంచి ఒక్క నయాపైసా తీసుకోని సీపీఎం పార్టీ ఈ నెల 19 నుంచి ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు ప్రజానిధి పేరుతో కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి అరుణ్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోదీని గద్దెదించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పార్టీలు బీజేపీకి మద్దతు పలికి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 20న విజయవాడలో తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ బ్యాండ్లను రద్దుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడం స్వాగతిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి వెచ్చించిన నిధులపై ఎంపీ భరత్ రామ్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగరాన్ని అభివృద్ధి చేశాం అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ , జిల్లా నాయకులు ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత యోగా తరగతులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 17: నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న యోగా తరగతుల శనివారం ముగిశాయి. వైసీపీ నాయకురాలు బళ్ళా సత్యవతి ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యోగా గురువు తీడా రామును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బళ్ళా శ్రీనివాసరావు, హెచ్ఎం కేవీవీ సత్యనారా యణ,పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఖలీల్ పాల్గొన్నారు.

చందన యాత్ర మహోత్సవాలు ప్రారంభం



కలశాలతో చందనయాత్రలో పాల్గొన్న మహిళలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 17: కోరుకొండ రోడ్డులోని సింహాచల నృసింహస్వామి క్షేత్రంలో శ్రీ మధుభయ వేదనాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యంలో 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం తిరువీధి (గరుడసేవ) ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి పర్యవేక్షణలో ఆలయం నుంచి మొదలైన గరుడసేవ మేళతాళాలతో బాణాసంచాతో కోలాహలంగా సాగింది. 21వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త, సభ్యులు సూర్యకుమారి, వెంకట శ్రీదేవి తెలిపారు. భక్తులంతా స్వామిని దర్శించుకోమని కోరారు.

క్షయ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రైమరీ హెల్త్ ఆసుపత్రి డాక్టర్ విజయలక్ష్మీ నీలిమ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 : క్షయ వ్యాధి అంటువ్యాధి అని, ఇది వ్యాప్తి కాకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రైమరీ హెల్త్ ఆసుపత్రి డాక్టర్ విజయలక్ష్మీ నీలిమ అన్నారు. యాంటీ టీబీ వీక్ సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం సారంగధర మెట్ట అర్బన్ ప్రైమరీ ఆసుపత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. క్షయ అంటువ్యాధి అని, ఏ వయస్సులోనైనా, ఎవరికైనా సోకవచ్చన్నారు. ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కేవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ వరకూ క్షయ నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్ర మంలో టీబీహెచ్‌వీ ఎం.శివ, డీఈవో రాజ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, స్టాఫ్‌నర్సు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

విద్యార్థుల అవగాహన సదస్సులో ట్రైనీ డీఎస్పీ భానోదయ



సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ భానోదయ

అనపర్తి, ఫిబ్రవరి 17: రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్‌సైట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని ట్రైనీ డీఎస్పీ భానోదయ అన్నారు. శనివారం జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాలులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో వచ్చే లోన్‌యాప్‌ల జోలికి పోవద్దని సూచించారు. సీఐ శివగణేష్ మాట్లాడుతూ నేటి యువత చెడు అలవాట్లకు బానిసలై చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మంచి నడవడికపైనే జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నల్లమిల్లి పెద అబ్బాయిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చింతా ఆనందరావు పాల్గొన్నారు.

రామవరంలో రక్తదాన శిబిరం

అనపర్తి, ఫిబ్రవరి 17: మండలంలోని రామవరంలో ధాత్రి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 97మంది రక్తదానం చేశారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తనయుడు సబ్బెళ్ళ సురేష్‌రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన జక్కంపూడి బ్లడ్ బ్యాంకు సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరిడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, గొలుగూరి గోవిందరెడ్డి, ధాత్రి ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల ఖర్చులతో కాలువ పూడిక తీత

అనపర్తి, ఫిబ్రవరి 17: సాగునీటి కోసం ఏటా తమకు కష్టాలు తప్పడం లేదని, సొంత ఖర్చులతో పూడిక తీసుకుంటున్నామని అనపర్తి-పందలపాక బోదె కాలువ చానల్ నెంబర్-3 కింద సాగు చేసుకునే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రొక్లెయినర్ ఏర్పాటు చేసుకుని మూడు రోజులుగా పూడికలు తీసుకుంటున్నారు. సంక్రాంతి ముందు రూ.1.50 లక్షలు రైతులంతా చందాలు వేసుకుని పూడికలు తీసుకున్నామని, ప్రస్తుతం మరో సారి పూడికలు తీయకుంటే పంట చేతికందడం కష్టమని, అందుకు మరో లక్ష వెచ్చించాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఎంపీకి ప్రైవేట్ ఆసుపత్రి నర్సుల వినతి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17: ప్రైవేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న మేల్, ఫిమేల్ నర్స్‌ల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ ఆసుపత్రి మేల్, ఫిమేల్ నర్స్ ట్రేడ్ యూనియన్ నాయకుడు నేదునూరి బోసు కోరారు. ఈ మేరకు శనివారం యూనియన్ నాయకులు నరేష్, సిద్దు, వంశీ, రాజు మణికంఠ, ఇజాక్, భాను, కేతా లత, నవీన్, ఫణి, శాంతి.. ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు వినతిపత్రం అందించారు. ఈ నెల 25న ప్రైవేట్ ఆసుపత్రి మేల్, ఫిమేల్ నర్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా మహాజన సభ నిర్వహిస్తామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై బాత్‌రూం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ విజయ్‌శంకర్ తెలిపారు.మృతుడికి సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని పసుపు రంగు గళ్ల చొక్కా, నీలం రం గు షార్టు ధరించి ఉన్నాడన్నారు.అతడి వివరాలు తెలిసిన వారు 0883 2442821, 94914 44022 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బత్తుల వెంకటలక్ష్మి పరామర్శ

కోరుకొండ, ఫిబ్రవరి17: మండలంలో పలు కుటుంబాలను జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి శనివారం పరామర్శించారు. దీనిలో భాగంగా నర్సాపురంలో ఇటీవల మృతి చెందిన చొంగా త్రిమూర్తులు కుటుంబాన్ని, ప్రమాదంలో గాయపడ్డ ఇంటి దుర్గాప్రసాద్‌ను పరామర్శించారు. అలాగే గాదరాడలో అత్తిలి రామకృష్ణ, పెనుగొండ శేషమ్మ, చిట్టిరెడ్డి అచ్చెన్న కుటుంబ సభ్యులను వెంకటలక్ష్మి పరామర్శించారు. కార్యక్రమంలో మారిశెట్టి త్రిమూర్తులు, మాట్లా నాగేశ్వరరావు, బత్తుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు గౌడ శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం

టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17: రాజమహేంద్రవరం ఆనందర్ రీజెన్సీ పందిరీ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు టీడీపీ ఆధ్వర్యంలో గౌడశెట్టిబలిజ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని టీడీపీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గౌడశెట్టిబలిజ ఆత్మీయ సమావేశానికి శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామోహ్మనరావు, ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశానికి గౌడ శెట్టి బలిజ కుటుంబీకులు రావాలన్నారు.

సాయి మందిర వార్షికోత్సవం

బిక్కవోలు, ఫిబ్రవరి 17: బలభద్రపురం సాయినాధుని మందిర వార్షికోత్సవం శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడా హారతి, గణపతి, దత్తాత్రేయ, ధుని పూజలు, మూల విరాట్‌కు క్షీరాభిషేకం జరిపారు. లక్షపత్రి పూజ, రాజరాజేశ్వరి దేవికి లక్ష కుంకుమపూజ, గోపూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. బాబాను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కొవ్వూరి పాపారెడ్డి, కర్రి వెంకటముకుందరెడ్డితోపాటు అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు బిరియాని ప్రసాదాన్ని అందించామని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు.

కోరుకొండలో ఉద్యోగ జేఏసీ ధర్నా



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు

కోరుకొండ, ఫిబ్రవరి17: వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు అన్యాయం చేసిందని, దీనికి నిరసనగా ఏపీ జేఏసీ కోరుకొండ సమితి యూనిట్ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయం చేయలేదన్నారు. ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు పోరుబాట పట్టామన్నారు. ఈ నెల 14 నుంచి వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా ధర్నాకు ముందు వారు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు సీహెచ్ త్రినాథ్ సూర్యకుమార్, సీహెచ్ విజయ కృష్ణ, యూటీఎఫ్ నాయకుడు మోహన్‌రావు, పీఆర్‌టీయూ నాయకుడు నాగేశ్వరరావు, ఝాన్సీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ప్రభుదాను, డీఎంకే ప్రసాద్, మారిశెట్టి నాగేశ్వరరా వు, పలువురు జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన ర్యాలీ

ధవళేశ్వరం, ఫిబ్రవరి 17: తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శనివారం ఉద్యోగులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ధవళేశ్వరం జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం నుంచి నినాదాలు చేస్తూ కాటన్ బ్యారేజి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ ఎస్.జయకుమార్, ఉపాధ్యక్షుడు పి.రాజబాబు, ఎన్జీవో నాయకులు బి.లక్ష్మణుడు, కేఎన్ గౌరీశంకర్, ఎస్.సత్తిరాజు, పీఎస్ శేషకుమార్, ఎస్.వాసుదేవి, అద్దంకి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చగడ్డి యంత్రాలు పంపిణీ

రంగంపేట, ఫిబ్రవరి 17: పశు సంవర్ధకశాఖ పాడి రైతులకు గడ్డిని ముక్కలు చేసే యంత్రాలను సబ్సిడీపై అందిస్తోందని వడిశలేరు పశువైద్యుడు జాన్‌పాల్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ గడ్డి యంత్రం ఖరీదు రూ.33970 కాగా సబ్సిడీ రూ.13588 పోను లబ్ధిదారుడు రూ.20382 చెల్లిస్తే సరిపోతుందన్నారు. మండలంలో మొత్తం ఆరు యంత్రాలు మంజూరు కాగా వాటిలో వడిశలేరు 4, ముకుందవరం, జి.దొంతమూరు గ్రామాలకు ఒక్కోటి చొప్పున పాడిరైతులకు అందించినట్టు జాన్‌పాల్ చెప్పారు. పశుగ్రాసాన్ని ముక్కలుగా చేయడం వల్ల గడ్డి వృథా అవ్వదని, గడ్డి కాండంలో ఉన్న చెక్కర పదార్థం పశువులకు అందుతుందని, సులువుగా జీర్ణమవుతుందని, పాల దిగుబడి, వెన్నశాతం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి



రాజానగరం, ఫిబ్రవరి 17: మహిళా అధ్యాపకులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు సూచించారు. గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా (ఏపీటీఐ) ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ఫోరం ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఫార్మా ఉమెన్స్ లీగ్-2024 పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా జోన్-2 పరిధిలోని ఫార్మా కళాశాల మహిళ అధ్యాపకులు క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్ తదితర క్రీడా పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఐ ఏపీ స్టేట్ ట్రెజరర్ ఎస్.రామచంద్రన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిస్మత్
సూర్యామినీ	: గేమ్ ఆన్
సూర్యాప్యాలస్	: ఫైటర్, హాపీ ఎన్‌డింగ్
స్వామి	: బూట్‌కట్ బాలరాజు
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	:
ఊర్వశి	: నా సామి రంగ
రంభ	: కెప్టెన్ మిల్లర్
మేనక	: ధీర
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వీఎస్ మహాల్(నామవరం)	: హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
రామకృష్ణ(కోరుకొండ)	: హనుమాన్
గీతాసినిమాస్ (సీతానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
లలితామహల్(రంపచోడవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
నవయుగ(చింతూరు)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్



నేడు 'దగాపడ్డ దళితుడా రా కదలిరా'

నిడదవోలు, ఫిబ్రవరి 17 : దగాపడ్డ దళితుడా రా.. కదలిరా అంటూ దళితుల కోసం ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిడదవోలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని దళిత సోదరులంతా కదలిరావాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు.



జిల్లా ఇసుక కమిటీతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్, జేసీ

ఇసుక అక్రమాలపై టాస్క్‌ఫోర్స్

- ఐదుగురితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశాలు
- జిల్లాలో 14 ఓపెన్ రీచ్‌లకు అనుమతులు
- జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక అక్రమాలను నియంత్రించడానికి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు.ఇటీవల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈబీ,మైన్స్, ఇరిగేషన్,పోలీసు, రెవెన్యూ అధికారులతో ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా గుర్తించిన 14 ఓపెన్ రీచ్‌లకు అనుమతులిస్తున్నట్టు తెలిపారు.ఐదు హెక్టార్లకు మించిన ఓపెన్ రీచ్‌లలో మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రత చర్యల్లో భాగంగా బ్యారేజీ,ఇతర వంతెనలకు 500 మీటర్ల లోపు తవ్వకాలు నిషేధమని,హద్దులు ఏర్పాటు చేసి బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఐదు హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రీచ్‌లను గుర్తించామని, ప్రజాభిప్రాయం సేకరించి.. 15 రోజుల్లో కార్యాచరణ పూర్తిచేయాలన్నారు. బోట్స్‌మన్ సొసైటీలకు మార్గదర్శకాలకు లోబడి ఎన్‌వోసీలు జారీ చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఎన్. తేజ్‌భరత్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్,జిల్లా మైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, సెబ్ అధికారి వి.సోమ శేఖర్, గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓపెన్ ఇసుక రీచ్‌లకు అనుమతి

జిల్లాలో మరొక 14 పెద్ద ఓపెన్ ఇసుకర్యాంప్‌లకు జిల్లా ఇసుక కమిటీ అనుమతించింది.సీతానగరం మండలం సింగవరం ఇసుక ర్యాంప్‌లో 36.885 హెక్టార్లు, ముగ్గుళ్ల 30.055 హెక్టార్లు, మునికూడలిలో 33.239, కాటవరంలో 23.117 ఇసుక తవ్వకాలకు అనుమతించింది.కాతేరులో 41.51 హెక్టార్లు, కొవ్వూరు మండలం కుమారదేవం ర్యాంప్‌లో 59.07, అరికిరేవుల 59.50, చిడిపి ర్యాంప్‌లో 48.3 హెక్టార్లకు అనుమతులిచ్చింది. తాళ్ళపూడి మండలం తాడిపూడి ర్యాంప్‌లో 49.40 హెక్టార్లు, పక్కిలంక ర్యాంప్‌లో 47 హెక్టార్లకు అనుమతించింది. పక్కిలంకకు చెందిన మునికూడలి ర్యాంప్ పాయింట్‌లో 37 హెక్టార్లు, నిడదవోలు మండలం పురుషోత్త పల్లి ర్యాంప్‌లో 11.50 హెక్టార్లు, జీడిగుంట ర్యాంప్‌లో 12,పెండ్యాల ర్యాంప్‌లో 44.80 హెక్టార్లకు అనుమతులు ఇచ్చింది.

శిలాఫలకాలకు రూ. 5 లక్షలా? 8
నిడదవోలు కౌన్సిల్ సమావేశంలో టీడీపీ నిలదీత

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య
23 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్యకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి సూచించారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్(ఐబీ/సీబీఎస్ఈ/ఐసీఎస్‌ఈ/స్టేట్ సిలబస్) పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద పిల్లలకు కేటాయించాలన్నారు. చదువుపై ఆసక్తి ఉన్నా ప్రతికూల పరిస్థితుల వల్ల సాధ్యంకాని అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు http://cse.ap.gov.in వెబ్ పోర్టల్‌లో ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్‌లోని డేటా ద్వారా మార్చి 22లోపుగా విద్యార్థుల అర్హతలను నిర్ధారించడం జరుగుతుందన్నారు. లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. మొదటి దఫా లాటరీ ఫలితాలను ఏప్రిల్ 1న ప్రకటిస్తారని.. సీట్లు పొందిన విద్యార్థులు ఏప్రిల్ 10వ తేదీలోపుగా ఆయా పాఠశాలలకు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలన్నారు. రెండో దఫా లాటరీ ఫలితాలను ఏప్రిల్ 15న ప్రకటిస్తారని..అదే నెల 23వ తేదీలోగా సీటు నిర్ధారణ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్ / జనన ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

రాజానగరం, ఫిబ్రవరి 17 : రానున్న ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిబద్ధతగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్ సూచించారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం జరిగిన ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా అమలు చేసేలా విధులను నిర్వర్తించాలన్నారు. పోటీలో నిలబడే అభ్యర్థులు చేసిన ఖర్చులు, ప్రచారం, ర్యాలీలు తదితర విభాగాల వారీగా ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రత్యేక దృష్టి సారించి వివరణ కోరాలన్నారు. ఎన్నికల నిర్బంధ నిర్వహణా వ్యవస్థ బృందాల్లో పోలీస్, ఆదాయ పన్ను, రాష్ట్ర ఎక్సైజ్, కేంద్ర, రాష్ట్ర గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ అధికారులు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు. ఎస్పీ జగదీశ్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో జేసీ ఎన్.తేజ్‌భరత్, డీఆర్వో జి.నరసింహులు, ఆర్వోలు, ఈఆర్వోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

53 కేంద్రాల్లో 25న గ్రూప్-2 పరీక్షలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 53 కేంద్రాల్లో 18,501 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలకు హాజరు కానున్నారని జేసీ తేజ్ భరత్ శనివారం తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9గంటలలోగా వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి లేదన్నారు.ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలతో వర్చువల్ విధానంలో జేసీ సమావేశమయ్యారు.

వలంటీర్స్!



వలంటీర్‌కు అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి (ఫైల్)

వైసీపీకి ఓటేయించండి.. భవిష్యత్ మీదే..?

- వలంటీర్లకు వైసీపీ నాయకుల వల
- ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు
- అవార్డులంటూ నగదు బహుమతులు
- ఓట్లు దండుకునే పన్నాగానికి పదును
- పార్టీ కోసం పనిచేయాలని హుకుం
- వైసీపీకి జై కొట్టకపోతే పీకివేత
- జిల్లాలో 35 మంది తొలగింపు
- నెలకూ కేవలం రూ.5750
- ఉపాధి కూలీ కూడా రాని వైనం
- జీతం పెంపు ఊసేలేదు
- గతం వాటికే దిక్కులేదు
- ఎన్నికల ముందు మళ్లీ హామీలు

ఉపయోగించు.. వదిలెయ్.. ఇదీ జగన్ సూత్రం.. నాయకులకే కాదండోయ్.. వైసీపీ ప్రభుత్వ ఏ కార్యక్రమమైనా ముందుండి నడిపించే వలంటీర్లదీ ఇదే పరిస్థితి.. ప్రతీ ప్రభుత్వ పథకానికి.. చివరికి ప్రచారానికి వలంటీర్లను వినియోగిస్తున్నారు.. అయితే సేవకులంటూ వారికిచ్చేది మాత్రం కొంతే.. ప్రస్తుతం రూ.30 వేలు వచ్చినా బతకలేని పరిస్థితి.. అటువంటిది కేవలం రూ.5,750తో నెల మొత్తం పనిచేయిస్తున్నారు.. అంతే కాదండోయ్.. మళ్లీ వైసీపీని గెలిపించండి.. మీకు అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఊరిస్తున్నారు.. అధికారంలో ఉండగానే ఏం చేయలేదు.. మళ్లీ వచ్చాక చేస్తారంట అంటూ వలంటీర్లు పెదవి విరుస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'మసిపూసి మారేడుకాయ' అంటే వినడమేగానీ చూసి ఉండరు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగన్ అడుగడుగునా ఆ సామెతను నిజం చేసి చూపిస్తున్నట్టుగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వలంటీర్ల విషయంలోనూ ముందు నుంచీ అదే జరుగుతోంది. సమాన పనికి సమాన వేతనం అనే నిబంధనను తప్పించుకోవడానికి ఆ ఉద్యోగానికి వలంటీరు అని పేరుపెట్టి కపటప్రేమ కురిపిస్తూ అడుగడుగునా వారి శ్రమను దోచుకుంటున్నారు. ఓట్ల వేటలో భాగంగా ప్రజల డేటాను దొడ్డిదారిన సేకరించడానికి వలంటీర్లను ప్రభుత్వం నియమించుకుందనేది జగనెరిగిన సత్యం. వలంటీర్లు 'వారి' సైన్యమని జగనే స్వయంగా ప్రకటిస్తున్నారు. ఏడాదికి ఓమారు వలంటీర్లపై అవార్డుల ప్రేమను ఇబ్బడిముబ్బడిగా వలకపోస్తున్నారు. అయితే వలంటీర్ల కన్నీళ్లను మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంటింటికీ తిరిగి సేవ చేస్తున్నా వచ్చే జీతం సరిపోక అప్పులపాలు అవుతున్నా.. ఆరోగ్యాలు పాడవుతున్నా ప్రభుత్వం కంటికి కనిపించడం లేదు. వలంటీర్లలో ఉన్నత విద్యను అభ్యసించిన వాళ్లు చిన్న గౌరవభృతితో నెట్టుకొస్తున్నారు. ఎన్నికల వేళ తమతో ప్రభుత్వం ఎలాగూ 'ఏకపక్షంగా' పనిచేయించు కుంటుందనీ..అప్పుడైనా తమ జీతాలు పెంచే ప్రకటన చేస్తారని పెట్టుకున్న నమ్మకం వమ్మని తేలిపోయింది. దీంతో అధికశాతం వలంటీర్లు ఆవేదనలో మునిగిపోయారు.

ప్రసన్నానికి ఎర

ఎన్నికల వేళ వలంటీర్లను ప్రసన్నం చేసుకోడానికి వైసీపీ నేతలు ఎన్నో ఎత్తులు వేస్తున్నారు. ఎన్నికల్లో వారి సేవలను వినియోగించడానికి వీల్లేదంటూ కేంద్ర ఎన్నికల సంఘం గట్టిగా చెప్పడంతో వారి సేవలను తెరచాటున వినియోగించుకోడానికి వైసీపీ నేతలు ఉపక్రమించారు. వలంటీర్లకు సత్కారాలంటూ కొంత మొత్తం వారి చేతిలో పెట్టి వైసీపీ కోసం పనిచేయాలని హుకుం జారీ చేస్తున్నారు.సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అంటూ అవార్డులను తెరపైకి తెచ్చారు.అవి ఎందుకు ఉపకరిస్తాయో తెలియదు గానీ వైసీపీ నాయకుల బిల్డప్పులు మాత్రం వీర లెవెల్లో ఉంటున్నాయి.ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్వీయలబ్ధికి వలంటీర్లకు అవార్డుల పేరిట ఇచ్చే మొత్తాన్ని అమాంతం పెంచేసింది.అయితే ఎక్కువ మొత్తం బహుమతి ఉన్న అవార్డుల సంఖ్య తగ్గించేసి 'లెక్క' సరిపెట్టిందనే ఆరోపణలున్నాయి. విశేషంగా సేవ చేసిన వలంటీర్లకు మండల,మునిసిపల్ స్థాయిలో రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలంటూ గతంలో లేని తాయిలాన్ని ఎన్నికల సందర్భంగా ఈసారి అమల్లోకి తీసుకురావడం గమనార్హం.

ఉపాధి కూలీ నయం

రోజుకు రూ.200 కూడా గిట్టుబాటు కాని జీతంతో జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని.. వేతనం పెంచాలని ఇన్నేళ్ల నుంచీ వలంటీర్లు పెడుతున్న గగ్గోలు చెవిటి ప్రభుత్వానికి వినిపించలేదు. వీరి జీతం ముందు ఉపాధిహామీ కూలీ రాబడి కాలరెగరేస్తోంది. వలంటీరు చేసేది ఉద్యోగం కాదని సేవంటూ వైసీపీ ప్రభుత్వం తీపి కబుర్లు చెబుతూ వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటోంది. వారి ఆవేదనను వినిపించడానికి సమ్మె చేద్దామని అనుకున్నా బెదిరింపులతో నోళ్లు నొక్కేసింది. తమకు నెలకు ఇచ్చే రూ.5,750 జీతం ఎలా సరిపోతుందని, పెట్రోలు ఖర్చులకు రావడం లేదని వలంటీర్లు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్ పాడైతే ఆ జీతంలోనే మరమ్మతు చేయించుకోవాలి. ఇతర ఎలవెన్సులేమీ ఉండవు. కానీ, జీతం పెంపుపై ప్రభుత్వం ఎప్పుడూ దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఎన్నికల వేళ కొంత డబ్బు ఆశజూపి 'ఓట్లు' వేయించుకొనే పన్నాగానికి పదును పెట్టింది.

మా బొమ్మే ఉండాలి

వలంటీర్లను ప్రభుత్వం ఎంత వేదనకు గురిచేస్తుందో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. నెలకు లక్షల రూపాయలు జీతం అందుకునే కొలువులో ఉన్నా ఆ ఉద్యోగికి సొంతంగా కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. దానిని ప్రశ్నించే అధికారం ప్రజాస్వామ్యంలో ఎవరికీ లేదు. కానీ, రోజు కూలీ కూడా గిట్టుబాటు కాని వలంటీర్లపై వైసీపీ పెద్దలు గెద్దల్లా మారి మౌఖిక ఆదేశాలిచ్చేస్తున్నారు. వైసీపీ గెలుపునకు అహర్నిశం పనిచేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వైసీపీ మినహా ఇతర పార్టీ వాళ్లతో కనబడినా చాలు ఉద్యోగం పీకేస్తున్నారు. ధవళేశ్వరం, రాజమహేంద్రవరం రూరల్‌లో 35 మంది వలంటీర్లను ఇటీవల తొలగించారు.వాళ్లు చేసిన తప్పు ఏమిటంటే జనసేన నాయకుల ఫొటోలను పెట్టుకోవడమేనట. ఇలా బొమ్మా మాదే.. బొరుసూ మాదే ఉండాలి. లేదంటే పీకేస్తామంటూ వైసీపీ నాయకులు బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారిపోయింది. వైసీపీకి ఎన్ని ఓట్లు వేయిస్తే అన్ని తాయిలాలంటూ మభ్యపెడుతున్నారు. వలంటీర్లు తమ ఓటును కూడా ఇష్టపూర్వకంగా వేసుకోడానికి వీల్లేని పరిస్థితిని సృష్టిస్తున్నారు.

ఉద్యోగం ఉంటుందా!?

వలంటీర్ల చేతిలోని ప్రభుత్వం ఇచ్చిన ఫోన్‌లో ప్రజల సమాచారం నిక్షిప్తమై ఉంది. ఆ సమాచారాన్ని ఎన్నికల వేళ వాడుకునేందుకు ఫోన్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉందని సమాచారం.ఈ విషయంపై ఇప్పటికే కొందరు వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వచ్చే నెల నుంచి ఉద్యోగం ఉంటుందో లేదోననే సందిగ్ధం నడుస్తోంది. ఫోన్లు వెనక్కు తీసుకొని అవార్డుల పేరుతో కొంతమొత్తం చేతిలో పెట్టి సరిపెట్టుకోమనే ఉద్దేశంలో వైసీపీ ప్రభుత్వం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 9,034 మంది వలంటీర్లు ఉండగా.. సుమారుగా అందరికీ అవార్డులను ప్రకటించేశారు. మూడు కేటగిరీల్లోనూ బహుమతి మొత్తం ఎక్కువగా ఉన్న సేవావజ్ర విభాగంలో కేవలం 37 మందిని మాత్రమే ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం సేవలందిస్తున్న వలంటీర్లలో సేవావజ్రాలు 5 శాతం లేకపోవడం గమనార్హం. సేవారత్నల కేటగిరీలో 118 మందికి మాత్రమే అవకాశం దక్కింది. మిగతా వారందరికీ సేవామిత్ర పేరుతో స్వల్ప మొత్తం ముట్టజెప్పనున్నారు. జాబితా ప్రకారం కొవ్వూరు అర్బన్, పెరవలి మండలాల్లో సేవా వజ్రాలు లేనేలేరు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఆరుగురు ఉండగా.. మిగతా మండలాల్లో మండలానికి ఒకరిద్దరిని ఎంపిక చేశారు. ఇప్పటికే జగన్ ఈ 'పథకాన్ని' ప్రారంభించగా.. జిల్లాలకు ఇంకా నిధులు రాలేదు. అందాక శాలువాలు, పతకాలు మాత్రం వచ్చాయి. వలంటీర్ల పేర్లతో కూడిన జాబితా కూడా రావాల్సి ఉంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు దుర్గేష్

రాజమహేంద్రవరం రూరల్ టిక్కెట్ నాదే : దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 :రాజమహేంద్రవరం రూరల్ సీటు తనదేనని, ఈ మేరకు పవన్ కల్యాణ్ స్పష్టమైన హామీ ఇచ్చారని జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను అసత్యాలు చెప్పడంలేదని, నాలుగురోజుల కిందట మంగళగిరి వెళ్లినప్పుడు పవన్ కల్యాణ్ తనతో చెప్పడం జరిగిందన్నారు. దీనిపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉమ్మడిగా అధికారిక ప్రకటన చేయాల్సి ఉందన్నారు. రెండేళ్ల క్రితం టీడీపీతో మాకు పొత్తులేదు.. అప్పుడు చంద్రబాబు తన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇస్తామని చెప్పి ఉండొచ్చు అన్నారు. కానీ ఇప్పుడు జనసేనతో పొత్తు ఉంది. పొత్తు ధర్మం పాటించాల్సిందే అన్నారు. పవన్ కల్యాణ్ పర్యటనలకు అడ్డంకులు సృష్టిస్తున్న అధికారులు ఎన్నికల తర్వాత ఇబ్బంది పడాల్సి ఉంటుందని, ఎవరు వ్యతిరేకంగా పనిచేస్తున్నారో గుర్తు పెట్టుకుంటామన్నారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను కొనసాగించాలని వైసీపీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి కోరడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో నగర ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

మహిళల రక్షణకు చట్టాలు : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహిళలతో గౌరవంగా ప్రవర్తించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధచట్టం-2013పై జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా వివక్షకు, వేధింపులకు గురవుతుండడం దురదృష్టకరమన్నారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి కార్యాలయంలో ఉండే అంతర్గత ఫిర్యాదుల కమిటీకి బాధితుల తరఫున ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ స్పష్టం చేశారు. వేధింపుల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అవసరమైతే బాధించినవారిని విధుల్లోంచి తొలగించడానికి అవకాశం ఉందన్నారు.మహిళలకు చట్టం అండగా ఉంటుందన్నారు. సమస్యలను ధైర్యంగా చట్టం ముందుకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం కోర్టుల్లో పనిచేస్తున్న 200 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రావడంలేదని..
భర్త ఆత్మహత్య

రాజానగరం,ఫిబ్రవరి 17 : భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందిన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన రాపాక ప్రసాద్(36) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తడంతో ఏడాది కిందట భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఇటీవల భార్య వద్దకు వెళ్లి కాపురానికి రావాలని కోరాడు. అయితే భార్య నిరాకరించడంతో 15వ తేదీన ఇంటికి వచ్చి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఉపక్రమించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ మనోహర్ శనివారం కేసు నమోదు చేసినట్టు సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు.

15న ఇంటి నుంచి వెళ్లి.. 17న క్వారీ గోతుల్లో శవమై..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువకుడు ఓ రోజులో నిర్జీవంగా ఇంటికి చేరడంపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. సుబ్బారావునగర్‌కి చెందిన తుమ్మల లోవరాజు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో 16న త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. క్వారీ మార్కెట్ సమీపంలోని క్వారీ గోతుల్లో ఓ శవం తేలుతోందని పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే వెళ్లి ఆ మృతదేహాన్ని బయటకు తీశారు. అంతకుముందు వచ్చిన ఫిర్యాదుతో సరిపోల్చి విచారించగా లోవరాజు(26) అని బంధువులు గుర్తుపట్టారు.కేసు తదుపరి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ పేర్కొన్నారు. క్వారీ గోతుల్లో జనం పడి చనిపోతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సర్కారు తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 17 : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించకపోతే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఏపీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు శనివారం ధర్నా చేశారు. నగరంలో ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నగర జేఏసీ అధ్యక్షులు సుబ్బారావు నాయుడు, కన్వీనర్ సేవా ప్రవీణ్‌కుమార్, ఏపీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛనుదారులను తీవ్రమైన మానసిక క్షోభకు గురిచేస్తున్నదని విమర్శించారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలకు, పెన్షన్‌కు ఎదురు చూడాల్సిన దుర్భర పరిస్థితి ఉందన్నారు. అధికారంలోకి రాగానే వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్మోహనరెడ్డి చేతులెత్తేశారని, 180 నెలలకు పైగా డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.షరీఫ్, రమేష్, పింఛనుదారుల సంఘం నాయకులు కేజీకే మూర్తి, కేకే సంజీవరావు, పార్వతి, ఎన్జీవో నాయకులు అనిల్‌కుమార్, మీసాల మాధవరావు, రాజశేఖర్, ఆనంద్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, గెజిటెడ్ అధికారుల సంఘం తరఫున వ్యవసాయ అధికారులు శాంతా ఆలివ్ ఇతర అధికారులు పాల్గొని మద్దతు తెలిపారు.





రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, పింఛనుదారుల ఆందోళన

ఉద్యోగులకు నోటీసులు..

రాజమహేంద్రవరం అర్బన్/తాళ్ళపూడి, ఫిబ్రవరి 17 : పాత పింఛను సాధన కోసం సీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన చలో విజయవాడకు వెళ్లవద్దని పోలీసులు అడ్డుకున్నారు. విజయవాడలో జరిగే ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు నోటీసులు జారీ చేశారు.రాజమహేంద్రవరంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు,ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గా రావు, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావులకు శనివారం నోటీసులు అందజేశారు. దీనిపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేమంతా ఉద్యో గులమే కాని దొంగలం కాదని తమ న్యాయమైన కోర్కెల సాధనకై చేపట్టే కార్యక్రమాలను నిలువరించడానికి ఉద్యోగులను ఇలా హింస పెట్టడం దుర్మార్గ చర్య అన్నారు. ప్రభుత్వం చర్యలను ఖండిస్తూ ధర్నాలకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వందల మందిపై కేసులు పెడుతున్నందున చలో విజయవాడ వాయిదా వేసుకోవాలంటూ రాష్ట్ర నాయకులు తెలిపారన్నారు. ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ నిరసనలు తెలియజేయాలన్నారు.





తాళ్లపూడిలో ఏపీటీఎఫ్, సీపీఎస్ సంఘాల నాయకులకు నోటీసులు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఎన్నికల విధుల్లో బీఎల్‌వోలు కీలకం



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి, ఫిబ్రవరి 17: ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకమని తహశీల్దార్, సహాయ ఎన్నికల అధికారి సీహెచ్ శ్రీనివాసరావు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు అందరూ నిర్వర్తించాలని, ఏ ప్రభుత్వ శాఖ దీనికి మినహాయింపు కాదన్నారు. ఓటరు లిస్టుల్లో మృతి చెందిన ఓటర్లు ఎవ్వరూ ఉండకూడదని, 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరికీ ఓటును అందించాలన్నారు. బీఎల్‌వోలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు పడతారని, పేపర్లలో వచ్చే వార్తలకు సంబంధిత ఫారంలు పెట్టి ఎన్నికల కమిషన్‌కు సమాధానం ఇవ్వాలని తహశీల్దార్ చెప్పారు. సమావేశంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆర్‌ఐ కిషోర్, సీతారామరాజు, దీపక్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో ప్లాస్టిక్ తొట్టెలు పంపిణీ

తాళ్లపూడి, ఫిబ్రవరి 17: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో మండలంలోని వేగేశ్వరపురంలో శనివారం ఇంటింటికీ ప్లాస్టిక్ తొట్టెలు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా తడిచెత్త, పొడిచెత్తను విడివిడిగా సేకరించడానికి ప్లాస్టిక్ తొట్టెలను పంపిణీ చేసినట్టు సర్పంచ్ పరశురామారావు తెలిపారు.

పేదలకు వైద్యం మరింత చేరువ చేసేందుకు కృషి



మెరకవీధిలో అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, ఫిబ్రవరి 17: పేదలకు వైద్యం మరింత చేరువచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరులోని మెరకవీధి, రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ సెంటర్‌లో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకుంటామన్నారు. 19న తాళ్లపూడి మండలం తాడిపూడి నుంచి, 20న కొవ్వూరు టౌన్ 1వ వార్డు నుంచి పాదయాత్ర చేడతామన్నారు. రోజుకు ఒక మండలంలో పర్యటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్, బావన రాజేష్, సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పోసిన శ్రీలేఖ, దేవగుప్తాపు లక్ష్మణరావు, వర్రే మురళీ, గందం సాయి, వేండ్ర సూరిబాబు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలను సహించం: ఎస్ఐ

గోపాలపురం, ఫిబ్రవరి 17: ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో మద్యం అక్రమ సరఫరా, విక్రయాలు నిర్వహిస్తే సహించబోమని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నందిగూడెంలో దాడి చేసి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వసంతాడ ముక్కయ్యను అదుపులోకి తీసుకుని అతడి నుంచి ఆరు మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయులకు పోలీస్ నోటీసులు

చాగల్లు, ఫిబ్రవరి 17: ఏపీసీపీఎస్ సంఘం తలపెట్టిన ఓట్ ఫర్ ఓపీఎస్ ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులెవరూ హాజరు కారాదని పోలీసు నోటీసులివ్వడం సరికాదని యూటీఎఫ్ నాయకులు విమర్శించారు. శనివారం చాగల్లులో పలువురు ఉపాధ్యాయులకు పోలీసులు నోటీలిచ్చారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు పి.శ్రీనివాసమూర్తి, టి.నారాయణ, రవివర్మ, నాగరాజు తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల అణచివేత ధోరణిలో వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. వెంటనే ఉద్యోగులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆవపాడులో తాగునీటి కష్టాలు

- పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- మరమ్మతుల్లో అధికారుల నిర్లక్ష్యం
- తాగునీటికి గ్రామస్థుల అవస్థలు.. ట్యాంకర్లతో సరఫరా..



ట్యాంకర్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

నల్లజర్ల, ఫిబ్రవరి 16: ఆవపాడులో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ కొత్తపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడై ఐదు రోజులు అవుతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని జనసేన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయడం లేదని పేర్కొన్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా సొంత ఖర్చులతో తాను ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. అయితే పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారని వాపోయారు.

త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం

ఆవపాడు ఎస్సీ కాలనీలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోవడం వల్ల పని చేయడం లేదు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లు రిపేర్, రిప్లేస్ చేయడానికి అవకాశం లేదు. కొత్తగా త్రీఫేజ్ విద్యుత్ లైన్ వేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి కొత్తగా త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తాం. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలి.

-రాజుబాబు, ట్రాన్స్‌కో ఏడీఏ, నల్లజర్ల.

రేపటి నుంచి సీపీఎం ప్రజానిధి సేకరణ

సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 17: కార్పొరేట్ కంపెనీల నుంచి ఒక్క నయాపైసా తీసుకోని సీపీఎం పార్టీ ఈ నెల 19 నుంచి ప్రజల నుంచి విరాళాలు సేకరించేందుకు ప్రజానిధి పేరుతో కార్యక్రమం చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి అరుణ్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మోదీని గద్దెదించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో పార్టీలు బీజేపీకి మద్దతు పలికి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 20న విజయవాడలో తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రోల్ బ్యాండ్లను రద్దుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడం స్వాగతిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి వెచ్చించిన నిధులపై ఎంపీ భరత్ రామ్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగరాన్ని అభివృద్ధి చేశాం అంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్ , జిల్లా నాయకులు ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాలకు రూ.5 లక్షలా?

- టీడీపీ కౌన్సిలర్ నాగేశ్వరరావు ప్రశ్న
- వాడీవేడిగా నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు, సభలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ నాగేశ్వరరావు

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలు పట్టణ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలకు ప్రజాధనం వినియోగించడం ఎంతవరకు సమంజసమని టీడీపీ కౌన్సిలర్ నాగేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం నిడదవోలు మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అజెండాలోని మొదటి అంశం పట్టణంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తూ మున్సిపల్ చైర్మన్ నోటిపై చేస్తూ కౌన్సిల్ ఆమోదానికి తీసుకొచ్చారు. దీనిపై కౌన్సిలర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్రే శిలాఫలకాలను ఏర్పాటు చేస్తాడని, ప్రజాధనం ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ఆదినారాయణ సమాధానమిస్తూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సంత మార్కెట్‌లో అప్పటి మున్సిపల్ చైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి పేరుతో ఆర్చ్ ఎందుకు నిర్మించారని, అలాగే మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పురపాలక సంఘం 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మించిన స్థూపానికి మున్సిపల్ నిధులు ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. దీనిపై నాగేశ్వరరావు మాట్లాడుతూ వంక లేని అమ్మ డొంక పట్టుకున్నట్టు.. ఇప్పుడు అడిగిన ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పకుండా చైర్మన్ ఎందుకు సమాధానం చెప్తున్నారని ప్రశ్నించగా మున్సిపల్ డివిజినల్ ఇంజనీర్ మాధవి మాట్లాడుతూ జిల్లాలోని పురపాలక సంఘాల్లో శిలాఫలకాలకు మున్సిపల్ సాధారణ నిధులే వెచ్చిస్తున్నారని సమాధానమిచ్చారు. ప్రజాధనం దుర్వినియోగం అవ్వడంపై నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలోని పలు అభివృద్ధి పనులను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ అధికార్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పల్స్ పోలియో విజయవంతం చేద్దాం

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి రాజకుమారి



అధికారులతో చర్చిస్తున్న జిల్లా అధికారిణి రాజకుమారి

నల్లజర్ల, ఫిబ్రవరి 17: వచ్చే నెల 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి రాజకుమారి ఆదేశించారు. నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐవో నల్లజర్ల, పోతవరం వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసి పల్స్ పోలియో కార్యక్రమంపై చర్చించారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశవర్కర్ల సహయంతో పోలియో చుక్కలు సకాలంలో వేయ్యలన్నారు.వ్యాక్సిన్ భద్రపరిచే ఐ.ఎల్.ఆర్ డి ఫ్రిజ్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తెల్లం గంగధరరావు,మహ్మద్ సిరాజ్ ఉద్దీన్,జీ.వి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

దేవరపల్లి, ఫిబ్రవరి 17: దేవరపల్లిలో షిరిడి సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవంలో భాగంగా శనివారం దత్తహోమం, కాలభైరవ హోమం, ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఘంటసాల ఫణికుమార్ ఆధ్వర్యంలో ఈ హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు అగ్నిహోత్రం సత్యనారాయణ చార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

కోట సత్తెమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా సూర్యప్రకాష్



నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం(శివ)ను సామర్లకోటలోని కుమార భీమేశ్వరస్వామి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేశారు. కోట సత్తెమ్మ ఆలయాన్ని అసిస్టెంట్ పరిధిలోకి తేవడంతో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అసిస్టెంట్ కమిష నర్‌గా విధులు నిర్వహిస్తున్న హరి సూర్యప్రకాష్‌ను కోట సత్తెమ్మ ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు నిడదవోలులో 'దగాపడ్డ దళిత వీరా రా కదలిరా'

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలులోని బీఆర్ అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు దగా పడ్డ దళిత వీరా రా కదలి రా కార్యక్రమం నిర్వహిస్తున్నామని మహాసేన ప్రకాష్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా మహాసేన రాజేష్ పాల్గొననున్నారని, జిల్లాలోని దళితులందరూ కదలి రావాలని కోరారు.







ఇంటింటికీ జనసేన కార్యక్రమంలో టీవీఆర్

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 17: వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, 2024 ఎన్నికల్లో ఆ పార్టీని భూస్థాపితం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. శనివారం స్థానిక బ్రిడ్జిపేట దళితవాడలో ఇంటింటికీ జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి, పార్టీ గుర్తు గాజు గ్లాసులను పంపిణీ చేశారు. జనసేన-టీడీపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డేగల రాము, కె.నవ్య, గంగుమళ్ల స్వామి, జనసైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర భారతిలో సైన్స్ ఫెయిర్



ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిడదవోలు, ఫిబ్రవరి 17: విద్యార్థులు విజ్ఞానశాస్త్ర ప్రదర్శన(సైన్స్ ఫెయిర్)లో పాల్గొనడం ద్వారా శాస్త్ర సాంకేతిక పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందని స్వతంత్ర రాజకీయ నాయకుడు కస్తూరి సత్యప్రసాద్ (నాని) అన్నారు. శనివారం నిడదవోలులోని రవీంద్ర భారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల సైన్స్ ఫెయిర్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని ఆసక్తి ప్రతిభ బయటపడుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షాకీరా బేగం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంకులు అందించే పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లజర్ల, ఫిబ్రవరి 17: బ్యాంకులు అందించే పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా ఎల్‌డీఎం ప్రసాద్ అన్నారు. శనివారం నల్లజర్లలో రిజర్వ్ బ్యాంకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవర్నస్ ఫండ్, యూనియన్ బ్యాంకు సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సంస్థ ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైం ఎక్కువగా జరుగుతుందని తెలియని వ్యక్తులు పిన్ నెంబరు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు మేనేజర్ లక్ష్మీ ప్రసన్న, కౌనిల్సలర్ బి.చైతన్య ప్రదీప్, బాబురావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

నిడదవోలు, ఫిబ్రవరి 17: వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బకాయిలను చెల్లించాలని సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కె.నందీశ్వరుడు అన్నారు. శనివారం నిడదవో లులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జ యకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.జయంత్, ట్రెజరర్ మాణిక్యాలరావు, కీర్తి ఆంజనేయులు, కల్యాణ్ కృష్ణ, కరుణ్ కుమార్, బి.రమణ అప్పారావు, బలగం అప్పారావు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్నిచ్చే క్రీడలు ఆడాలి

నల్లజర్ల, ఫిబ్రవరి 17: నేటి యువత సెల్‌ఫోన్, సోషల్ మీడియాలో సమయాన్ని వ్యర్థం చేయకుండా ఆరోగ్యాన్నిచ్చే క్రీడలపై దృష్టి పెట్టాలని సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. నల్లజర్ల సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో మూడు రోజుల నుంచి జరుగుతున్న స్పోర్ట్ సమ్మిట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే భవిష్యత్ బాగుంటుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మేణ్ణి జానకీదేవి, నీరుకొండ జయకృష్ణ పాల్గొన్నారు.





